GV MALL shop & celebrate TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 110 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
ఆదివారం 24 నవంబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# ‘ఈ రోజు ఎంతో ప్రత్యేకం’.. ఎన్సీసీలో తన అనుభవాలను గుర్తుచేసుకున్న మోదీ

**నేడు ఎన్సీసీ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ తన అనుభవాలను పంచుకున్నారు.**

**దిల్లీ, నవంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్): యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాతత్వాన్ని పెంపొందించడంలో ఎన్సీసీ ప్రముఖ పాత్ర వహిస్తుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఆదివారం ప్రసారమైన 116వ ‘మన్ కీ బాత్’ ఎపిసోడ్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్సీసీ డే సందర్భంగా మాట్లాడిన ఆయన.. తాను క్యాడెట్గా ఉన్న సమయంలోని అనుభవాలను గుర్తు చేసుకున్నారు. “ఈ రోజు ఎన్సీసీ దినోత్సవం. ఇది ఎంతో ప్రత్యేకమైన రోజు. ఎన్సీసీ పేరు వినగానే మనందరికీ మన కాలేజీ, అలనాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తుంటాయి.**



నేను కూడా ఎన్సీసీ క్యాడెట్నే. ఆ సమయంలో నేను పొందిన అనుభవం నాకెంతో అమూల్యమైంది. పూర్తి విశ్వాసంతో ఈ మాట మీకు చెబుతున్నాను. యువతలో క్రమశిక్షణ, సేవా గుణాన్ని, నాయకత్వ లక్షణాలను మరింత పెంపొందించడంలో దీని పాత్ర కీలకం” అని ప్రధాని వ్యాఖ్యానించారు. గయానాలో తన పర్యటన గురించి మోదీ ప్రస్తావించారు. “భారత్కు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న గయానాలో ఒక మినీ భారత్ ఉంది. కూలీ పనుల కోసం 180 ఏళ్ల క్రితం ఎంతోమంది భారతీయులను అక్కడికి తీసుకెళ్లారు. అయితే.. నేడు విద్య, రాజకీయాలు, సంస్కృతి, వ్యాపారం ఇలా ఎన్నో రంగాల్లో భారత మూలాలున్న వ్యక్తులు తమదైన ముద్ర వేస్తున్నారు. ఆయా రంగాల్లో నాయకత్వం వహిస్తున్నారు. గయానా అధ్యక్షుడు మహమ్మద్ ఇర్ఫాన్ అలీ కూడా భారత్ సంతతి వ్యక్తే. దేశ వారసత్వం పట్ల గర్వపడేలా చేస్తున్నారు” అని కొనియాడారు. “మరోవైపు, స్లోవేకియాలో కూడా భారత్ సంస్కృతి పరిరక్షణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మన ఉపనిషత్తులు తొలిసారిగా వారి భాషలోకి అనువాదం జరిగాయి. ఈ ప్రయత్నాలు ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతి ప్రభావాన్ని ప్రతిబింబిస్తున్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కోట్లాది మంది హృదయాల్లో మన దేశ సంస్కృతి సంప్రదాయాల పట్ల ఉన్న అభిమానం మనందరికీ గర్వకారణం” అని పేర్కొన్నారు.

# అదానీని జగన్ మూడు సార్లు ఎందుకు కలిశారు?

## ఆనం వెంకటరమణారెడ్డి

**జగన్ అంతర్జాతీయ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని తెదేపా సీనియర్ నేత ఆనం వెంకట రమణారెడ్డి ఆరోపించారు.**



**అమరావతి, నవంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** మాజీ సీఎం జగన్ అంతర్జాతీయ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని తెదేపా నేత ఆనం వెంకట రమణారెడ్డి ఆరోపించారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఒప్పందాల్లో జగన్ భారీగా అవినీతి చేశారన్నారు. ఒప్పందాలపై మీడియాకు ఒక్క విషయం చెప్పలేదని.. ఇప్పుడు కథలు అల్లుతున్నారని దుయ్యబట్టారు. ఆ ఒప్పందాల్లో జగన్ రూ.1,750 కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. ఆయన 3 సార్లు అదానీని ఎందుకు కలిశారని ప్రశ్నించారు. 16 సీబీఐ కేసులున్నా జగన్ ఇప్పటివరకు కోర్టుకెళ్లలేదని.. వీటిపై న్యాయ-స్థానాలు త్వరగా విచారణ చేపట్టాలన్నారు.

# ఎన్నికల్లో ‘జరాంగే’ ఫ్యాక్టర్ విఫలమైందా? ఆయన స్పందనిదే..

**మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మరాఠ్వాడాలోనూ మహాయుతి సత్తా చాటింది. అయితే, ఎన్నికల ఫలితాలపై తన ప్రభావం కనిపించలేదనే వాదనలను మనోజ్ జరాంగే కొట్టిపారేశారు.**

**ముంబయి, నవంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహారాష్ట్రలో ఓ పేరు మార-ుమోగింది. ఆయనే.. మనోజ్ జరాంగే పాటిల్. మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆయన చేపట్టిన ఉద్యమం కారణంగానే లోక్సభ ఎన్నికల్లో మరాఠ్వాడా ప్రాంతంలో ‘మహా-యుతి’ కూటమికి ఎదురుదెబ్బ తగిలినట్లు విశ్లేషణలు వినిపించాయి.



అసెంబ్లీ ఫలితాలకు వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. మరాఠ్వాడాలోనూ మహా-యుతి సత్తా చాటింది. అయితే, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తన ప్రభావం కనిపించలేదనే వాదనలను ఆయన కొట్టిపారేశారు. “ఈ ఎన్నికల్లో నేను పోటీ చేయలేదు. పైగా.. ఎవరికీ మద్దతు ఇవ్వలేదు. అలాంటప్పుడు జరాంగే ఫ్యాక్టర్ విఫలమైందని ఎలా చెప్పగలరు? నేను మరాఠా సమాజాన్ని రాజకీయ పార్టీల చెరనుంచి విడిపించాను. దీంతో వారు స్వేచ్ఛగా ఓటేశారు. నా దృష్టంతా మరాఠాలకు సాధికారత కల్పించడంపైనే ఉంది” అని జరాంగే తెలిపారు. అసెంబ్లీకి ఎన్నికైన 288 మంది ఎమ్మెల్యేల్లో 204 మంది మరాఠాలే ఉన్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి తానూ అభ్యర్థులను బరిలోకి దించనున్నట్లు గతంలో ప్రకటించిన మనోజ్.. అనంతరం తన ప్రయత్నాన్ని విరమించుకున్నారు. విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జరాంగే నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతంగా సాగాయి. చివరకు రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి ఆయనతో చర్చలు జరిపింది. మరాఠ్వాడాలో లోక్సభ ఫలితాలపై ఉద్యమ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని.. అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన మద్దతు కోసం వివిధ పార్టీలు క్యూ కట్టాయి. చివరకు మహా-యుతి విజయం సాధించింది. ఉద్యమానికి కేంద్రంగా ఉన్న జాల్నాలోని మొత్తం అయిదు స్థానాలు.. మరాఠ్వాడా ప్రాంతంలోని 46 సీట్లలో 40 స్థానాలను అధికార కూటమి గెలుచుకోవడం గమనార్హం.

# వనవాసి, నగరవాసి, గ్రామవాసి.. ఎవరైనా భారతీయులే: నిర్మలా

**మన నాగరికత వనవాసి, నగరవాసి, గ్రామ వాసి ఇలా ఉండేదని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.**



**హైదరాబాద్, నవంబర్ 24, (రిపబ్లిక్ న్యూస్):** మన నాగరికత వనవాసి, నగరవాసి, గ్రామ వాసి ఇలా ఉండేదని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జగద్గురు ఆదిశంకరాచార్యులు నాలుగు పీఠాలు స్థాపించారని.. తన బాల్యంలో కంచి మఠం పరమాచార్య చంద్రశేఖరాచార్య సరస్వతి బోధనలు విన్నానని గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో నాలుగు రోజుల పాటు జరిగిన లోక్ మంథన్ ముగింపు వేడుకలకు ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్రసింగ్ షెకావత్, కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. “ ఇప్పటికీ రాజకీయ ప్రస్తావన వచ్చినప్పుడు, కొంతమంది బయటి నుంచి వలస వచ్చారనే చర్చ జరుగుతోంది. తమిళనాడులో కొన్ని సుబ్రహ్మణ్యం స్వామి క్షేత్రాలు ఉన్నాయి. వాటిని వనవాసీలు తమ దైవంగా పూజిస్తారు. ఆదివాసీల పట్ల వివక్ష ఉందని కొందరు అక్కడక్కడ మాట్లాడుతున్నారు. వనవాసి, నగరవాసి, గ్రామవాసి ఎవరైనా మన భారతీయ-ులే” అన్నారు.

## ఆ సంతోషం ఎక్కువ రోజులు నిలవదు: ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్

“వస్తు రూపేణా సంతోషం కోరుకున్నా.. అది ఎక్కువ రోజులు ఉండదు. ఋషుల ఆలోచనలో ఇది సనాతన దేశం. మన పూర్వీకుల్లో సంస్కారం ఉండేది. అందుకే వ్యవహారం ఉండేది. దేశంపైకి విదేశీయులు ఆక్రమణకు వచ్చి మన సంస్కృతిని చిన్నాభిన్నం చేశారు. ఆధ్యాత్మిక బాటలో ఉంటే ధర్మం నిలుస్తుంది. సృష్టి నియమానుసారంగా మన పూర్వీకులు నడిచేవారు. ఇప్పుడది లేదు.. ధర్మం కంటే అధర్మమే ఎక్కువైంది. మనుషుల్లో స్వార్థం పెరిగింది. ఇక ధర్మం ఎక్కడ ఉంటుంది? విజ్ఞానం ముందు ధర్మం ఉండదా? విజ్ఞానం ఉపయోగించేవాడి తీరు బట్టి ధర్మం నిలుస్తుంది. ధర్మం గురించి అందరం ఆలోచించాలి. దానికోసం మన విజ్ఞాన గ్రంథాలను అధ్యయనం చేయాలి. మనం వేరే గ్రౌండ్లోకి వెళ్లొద్దు. అవతలివాళ్లనే మన గ్రౌండ్లోకి పిలవాలి” అన్నారు.

## సనాతన ధర్మ పరిరక్షణకు లోక్ మంథన్లు మరిన్ని జరగాలి: గజేంద్రసింగ్

భారతదేశ చరిత్ర చూస్తే వేల సంవత్సరాల ఇతిహ-ాసం, సంస్కృతి, ప్రపంచంలోనే ఆధ్యాత్మిక కేంద్రంగా ఉందని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. మన విజ్ఞానాన్నంతటినీ ధ్వంసం చేశారన్నారు. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని దేశం నిలబడిందని.. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ఇలాంటి లోక్ మంథన్ కార్యక్రమాలు మరిన్ని జరగాల్సిన అవసరం ఉందన్నారు. “ఎన్ని విధ్వంసాలు జరిగినా భారత ధర్మం, సంస్కృతిని మరిచిపోలేదు. లోక కల్యాణం నుంచి విశ్వ కల్యాణం వరకు మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడమే మన ధర్మం. భారతదేశం సంస్కృతి, విభిన్న జాతులు, విభిన్న శైలి సంస్కృతులతో కూడిన దేశం. మన ఋషులు అమూల్యమైన సంపదను అందించారు. చెట్లకు పూజలు చేయడం వెనుక ఒక శాస్త్రీయ కోణం ఉండేది. గతంలో జరిగిన విధ్వంసం నుంచి భారత్ ఇప్పుడిప్పుడే పూర్వ వైభవం సంతరించుకుంటోంది” అన్నారు.

# బలిజ సంఘీయుల కార్తీకమాస వనభోజన మహోత్సవాలను దిగ్విజయంగా, వైభవపేతంగా నిర్వహిస్తాం

నంద్యాల, నవంబర్ 24 (రిపబ్లిక్ న్యూస్): స్థానిక బాల అకాడమీ ప్రాంగణం నందు బలిజవంశీయుల కార్తీకమాస వనభోజన మహోత్సవ ఆహ్వాన సంఘం, నంద్యాల వారి ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదీ ఆదివారం స్థానిక మూలమటం భీమలింగేశ్వర దేవస్థాన ప్రాంగణం నందు జరుప తలపెట్టిన బలిజవంశీయుల కార్తీకమాస వనభోజన మహోత్సవ సన్నాహక సమావేశం జరిగినది. ఈ సమావేశంలో పెద్దలు, ఆహ్వాన సంఘం సభ్యులు మాట్లాడుతూ ఈ సంవత్సరం కార్తీక వనభోజనాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టడం జరిగిందని ఈ కార్యక్రమంలో సంఘీయులందరూ ప్రతి బలిజ కుటుంబం నుండి సకుటం సకుటుంబ సపరివార సమేతంగా పాల్గొనవలనని కోరారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ కళాకారులు అదుర్స్ ఆనంద్ వారి మిత్ర బృందం పాల్గొని సంఘీ-యులను వారి జోక్స్,స్కిట్స్, డాన్స్ లతో అలరిస్తారని అలాగే ప్రతి 20 నిమిషాల కార్యక్రమం ముగుయు వరకు 10 కూపన్స్ డిప్ తీయడం జరుగుతుందని అలాగే బలిజ సంఘీ-యుల పిల్లలు వారి యొక్క నైపుణ్యాలను ప్రదర్శించుటకు ఇది ఒక వేదిక అని పిల్లలు తమ వివిధ టాలెంట్ డాన్స్, మిమిక్రీ ప్రదర్శించి గిఫ్టులు తీసుకోవలసినదిగా కోరడమైనది. బలిజ కుల పెద్దలు అందరూ ఈ కార్యక్రమములో పాల్గొంటారని వారి యొక్క సందేశాలు వినిపిస్తారని వారిని ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించటం జరుగుతుందని తెలిపారు. బలిజ కుల బంధువులందరికి ఏ చిన్న లోటుపాట్లు లేకుండా ఎంతో శ్రమకోర్చి ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆహ్వాన సంఘం సభ్యులు తెలియజేసారు. పై కార్యక్రమములో పసుపులేటి.నారాయణ, తోట. ధనుంజయుడు, పడకండ్ల. సుబ్రహ్మణ్యం,ఎం.జి.వి. రవీంద్రనాథ్, గిద్దేటి.వెంకటేశ్వర్లు, చెన్నంశెట్టి. శ్రీనివాసులు, తోటరామయ్య (రిటైర్డ్ లెక్చరర్ )వై.వి. కృష్ణయ్య,చలం బాబు, దండె.దస్తగిరి,దండె. శ్రీనివాసులు,దేవశం.గిరిబాబు, ఆర్. జి. మహేష్, కొమ్మా.శ్రీహరి పి. సుధాకర్,మెగా. నాగరాజు, పసుపులేటి. జనార్ధన్, పసుపులేటి. పృథ్వీ,పల్లె. భీమశంకర్, మిడత. పురుషోత్తం,మిడత. మురళి, తోట. భూపాల్ పాల్గొన్నారు.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# శోభితతో జీవితాన్ని పంచుకునేందుకు ఎదురుచూస్తున్నా: నాగచైతన్య

వివాహ తేదీ దగ్గరపడుతోన్న తరుణంలో తనకు కాబోయే సతీమణి శోభిత ధూళిపాళ్లను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు నటుడు నాగచైతన్య. ఆమెతో జీవితాన్ని ప్రారంభించేందుకు ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.



తనకు కాబోయే సతీమణి, నటి శోభితా ధూళిపాళ్లను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు నటుడు నాగచైతన్య. తన జీవితంలో ఏర్పడిన వెలితిని ఆమె పూర్తి చేస్తుందన్నారు. ఆమెతో జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆరంభించేందుకు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నానని తెలిపారు. "మా పెళ్లి చాలా సింపుల్, సంప్రదాయబద్ధంగా జరగనుంది. ఈవేడుకల్లో ఆర్భాటాలకు తావులేదు. ఉత్సాహంగా పనులు జరుగుతున్నాయి. గెస్ట్ లిస్ట్, పెళ్లికి సంబంధించిన ఇతర విషయాలను ఇద్దరం కలిసి నిర్ణయిస్తున్నాం. హైదరాబాద్లోని అన్నపూర్ణ స్టూడియోస్ మా కుటుంబానికి ఎంతో ప్రత్యేకం. స్టూడియోలోని తాతగారి విగ్రహం ఎదురుగా మా పెళ్లి జరగనుంది. ఆయన ఆశీస్సులు మాపై ఎప్పుడూ ఉండాలనే ఉద్దేశంతో ఇరు కుటుంబాలు ఈ నిర్ణయాన్ని తీసుకున్నాయి. ఆమెతో కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు ఆశగా ఎదురుచూస్తున్నా. తనతో నేనెంతగానో కనెక్ట్ అయ్యా. తను నన్ను బాగా అర్థం చేసుకుంది. నా జీవితంలో ఏర్పడిన శూన్యాన్ని తను పూడుస్తుందని నమ్ముతున్నా" అని ఓ ఆంగ్ల వెబ్సైట్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. నాగచైతన్య - శోభితా ధూళిపాళ్ల వివాహం డిసెంబర్ 4న హైదరాబాద్లో జరగనుంది. ఇరు కుటుంబాల పెద్దలు, ఆత్మీయుల సమక్షంలో ఈ వేడుక జరగనుందని టాక్. ఈ పెళ్లి గురించి ఇటీవల నాగార్జున స్పందించారు. "కుటుంబసభ్యులు, సన్నిహితులు, సినీ ప్రముఖులు మొత్తం 300 మందిని పిలవాలని అనుకుంటున్నాం. స్టూడియోలో అందమైన సెట్లో వీళ్ల పెళ్లి జరగనుంది. అలాగే పెళ్లి పనులు కూడా వాళ్లిద్దరే చేసుకుంటామన్నారు" అని అన్నారు. రిసెప్షన్ వివరాలను త్వరలో తెలుపుతామని అన్నారు. చై-శోభిత ఎంతోకాలం నుంచి స్నేహితులుగా ఉన్నారు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో ఆగస్టు 8న వీరి నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. నాగచైతన్య ప్రస్తుతం 'తండేల్' కోసం వర్క్ చేస్తున్నారు. చందు మొండేటి దర్శకుడు. సాయిపల్లవి కథానాయిక. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది.

# దాన్నుంచి కోలుకోవడానికి ఐదేళ్లు పట్టింది: సత్యదేవ్

సత్యదేవ్ ప్రధాన పాత్రలో దర్శకుడు ఈశ్వర్ కార్తిక్ తెరకెక్కించిన సినిమా 'జీబ్రా' హైదరాబాద్లో ఆదివారం నిర్వహించిన ప్రెస్మీట్ టీమ్ పాల్గొంది.



తనను స్టార్ అనుకుని దర్శకుడు ఈశ్వర్ కార్తిక్ చెన్నై నుంచి వచ్చి 'జీబ్రా' కథ చెప్పాడని సత్యదేవ్ నవ్వులు పూయించారు. సాధారణంగా ఇలాంటి స్టోరీలు తన వద్దకు రావని అన్నారు. ఈ ఇద్దరి కాంబినేషన్లో లో రూపొందిన 'జీబ్రా' ఇటీవల విడుదలైంది. ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పేందుకు టీమ్ ఆదివారం నిర్వహించిన ప్రెస్మీట్లో పాల్గొంది. సత్యదేవ్ మాట్లాడుతూ.. "ఈ సినిమాతో మనిషిగా రాటుదేలా. నాలో చాలా మార్పొచ్చింది. ఇంతకుముందు వేదికపై మాట్లాడాలంటే భయమేసింది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఇప్పటి వరకూ చాలా థియేటర్లు సందర్శించా. ప్రేక్షకుల స్పందన గమనిస్తే.. 80 శాతం పాజిటివ్, 20 శాతం నెగెటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చింది. పదేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా. ఇలాంటి చిత్రాల విడుదల విషయంలో నాకెప్పుడూ 'బ్లఫ్ మాస్టర్' గుర్తొస్తుంటుంది. మంచి విజయం అందుకుంటుందని నమ్మిన సినిమా తొలి రోజే నిరాశ పరిచింది. దాన్నుంచి కోలుకోవడానికి ఐదేళ్లు పట్టింది. 'జీబ్రా'లాంటి సినిమాలు ఓటీటీలో సూపర్హిట్ అవుతాయని చాలామంది అంటున్నారు. అక్కడ ఆడితే ఎవరికి ఉపయోగం? ఇలాంటి స్క్రిప్టులు సాధారణంగా నా వరకూ రావు. కానీ, నన్ను స్టార్ అనుకుని ఈశ్వర్ నాతో సినిమా తీశాడు. తెలుగు దర్శకుడైతే ఇంకా బాగా తీసేవాడని ఓ రివ్యూలో చదివా. అందుకు బాధ కలిగింది. తెలుగు రాకపోయినా నేర్చుకుంటూ సినిమాని పూర్తి చేశాడు. చెన్నై నుంచి హైదరాబాద్కు 500కి పైగా సార్లు ప్రయాణించాడు. సినిమాపై ఉన్న ప్రేమతో ఆయన అలా చేశాడు. తమిళ్, కన్నడలోనూ ఈ సినిమాకి మంచి ఆదరణ దక్కుతోంది. ఆయన యూనివర్సల్ కంటెంట్ అందించాడు" అని పేర్కొన్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# నెగటివిటీపై స్పందించిన అభిషేక్

ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అభిషేక్ నెగటివిటీపై స్పందించారు.




తన సరికొత్త చిత్రం 'ఐ వాంట్ టు టాక్ ప్రమోషన్స్లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నెగటివిటీపై అభిషేక్ బచ్చన్ మాట్లాడారు. విమర్శలను తాను పెద్దగా పట్టించుకోనని ఆయన అన్నారు. మనిషి ఎదుగుదలకు అది అడ్డంకిగా మారుతుందన్నారు. "హిందీలో ఒక సూక్తి ఉంటుంది. విషయం ఏదైనా సరే.. నువ్వు ఆచరించేది మంచి అయినప్పుడు దానిని ఎప్పటికీ వదలకూడదు. ప్రాథమిక విలువలు మార్చుకోకూడదు. అన్నింటి నుంచి అభివృద్ధి చెందుతూ ముందుకు సాగాలి. ఇదే నేను నమ్ముతా. నెగటివిటీని చూసి మారను. ఎప్పుడూ పాజిటివ్గానే ఉండాలనుకుంటా. ప్రతి మనిషి జీవితంలో ఇలాంటివి సర్వసాధారణం. సమస్య ఎంత పెద్దది అయినా.. ఆశతో ముందుకు అడుగు వేయండి. అలా కాకుండా సమస్య వచ్చినప్పుడు దాని నుంచి దూరం వెళ్లిపోతే.. అది కూడా తప్పు అంటారు" అని ఆయన తెలిపారు. గతంలో అమితాబ్ బచ్చన్ కూడా పరోక్షంగా కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. "నా కుటుంబం గురించి నేను అరుదుగా మాట్లాడుతుంటా. ఎందుకంటే అది నా సామ్రాజ్యం. దాని గోపత్యను కాపాడాల్సిన బాధ్యత నాపై ఉంది. అసత్య ప్రచారాలు ఎప్పటికీ అలాగే ఉంటాయి. పూర్తి సమాచారం తెలుసుకోకుండా అవాస్తవాలను మాత్రమే ప్రచారం చేస్తుంటారు. ఏదైనా విషయం గురించి మాట్లాడేటప్పుడు దాని గురించి పూర్తిగా తెలుసుకోవాల్సి ఉంటుంది. అది నిజమైన వృత్తి ధర్మం" అని తన బ్లాగ్లో రాసుకొచ్చారు. 'ఐ వాంట్ టు టాక్' చిత్రాన్ని సూజిత్ సర్కార్ తెరకెక్కించారు. అర్జున్ అనే ఎన్నారై పాత్రలో అభిషేక్ నటించారు. జీవితాన్ని మార్చే ఒక శస్త్ర చికిత్స చేయించుకోవడానికి తనను తాను సిద్ధం చేసుకునే ఓ వ్యక్తి కథ ఆధారంగా రూపొందిన చిత్రమిది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1859 : ఛార్లెస్ డార్విన్ తన "ఆరిజిన్ ఆఫ్ స్పీసీస్" ను ప్రచురించాడు.
- 1880 : భారత స్వాతంత్ర్య సమర-యోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య జననం (మ. 1959). (చిత్రంలో)
- 1924 : తెలుగు, తమిళ, హిందీ సినిమా దర్శకుడు తాతినేని ప్రకాశరావు జననం (మ. 1992).
- 1952 : భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు బ్రిజేష్ పటేల్ జననం.
- 1953 : ఆంధ్ర విశ్వకళా పరిషత్, హిందీ విభాగములో ఆచార్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ జననం.
- 1955 : ఇంగ్లాండుకు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు ఇయాన్ బోథం జననం.
- 1961 : భారతీయ రచయిత్రి, ఉద్యమకారిణి అరుంధతీ రాయ్ జననం.



ఛార్లెస్ డార్విన్




పట్టాభి సీతారామయ్య



తాతినేని ప్రకాశరావు



బ్రిజేష్ పటేల్



యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



ఐక్యరాజ్యసమితి



అరుంధతీ రాయ్

రిపబ్లిక్ స్పోర్ట్స్

# ఆరంభంలోనే ఆసీస్ మూడు వికెట్లు డౌన్.. పెర్త్ టెస్టుపై పట్టు బిగించిన భారత్

బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియాకు టీమ్ ఇండియా 534 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 3 వికెట్లు కోల్పోయి 12 పరుగులు చేసింది.




బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియాకు టీమ్ ఇండియా 534 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓవర్నైట్ స్కోరు 172/0తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్.. రెండో ఇన్నింగ్స్ను 487/6 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది. యశస్వి జైస్వాల్ (161) దంచికొట్టగా.. విరాట్ కోహ్లి (100లిబీ 143 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సు) సెంచరీతో ఆకట్టుకున్నాడు. కేఎల్ రాహుల్ (77) పరుగులు చేశాడు. నితీశ్ రెడ్డి (38బీ 27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సు) ఆకట్టుకున్నాడు. ఆసీస్ బౌలర్లలో నాథన్ లైయన్ రెండు, స్టార్క్, హేజిల్వుడ్, కమిన్స్, మిచెల్ మార్ష్ తలో వికెట్ పడగొట్టారు. కోహ్లి 16 నెలల తర్వాత టెస్టుల్లో శతకం బాదడం విశేషం. ఆస్ట్రేలియాలో కోహ్లికి ఏడో శతకం. కంగారుల గడ్డపై అత్యధిక సెంచరీలు చేసిన భారత ఆటగాడిగా విరాట్ రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ రికార్డు సచిన్ తెందూల్కర్ (6 సెంచరీలు) పేరిట ఉండేది. ఈ సెంచరీతో సచిన్ రికార్డును కోహ్లి బ్రేక్ చేశాడు.

## ఆరంభంలోనే 'కంగారు' పెట్టించారు

సెకండ్ ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్కు భారత పేసర్లు ఆరంభంలోనే వరుస షాట్లు ఇచ్చారు. తొలి ఓవర్లోనే మెక్ స్వీనీ (0)ని బుమ్రా వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. నైట్ వాచ్మెన్ వచ్చిన పాట్ కమిన్స్ (2) సిరాజ్ బౌలింగ్లో స్లిప్లో కోహ్లికి చిక్కాడు. మార్నస్ లబుషేన్ (3)ని బుమ్రా ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. దీంతో ఆసీస్ 12/3తో పీకల్లోతు కష్టాల్లో పడటంతో, భారత్ మ్యాచ్పై పూర్తి పట్టు సాధించింది. నాలుగో రోజు ఆరంభంలోనే మరిన్ని వికెట్లు తీస్తే రెండు సెషన్లలోపే మ్యాచ్ ముగిసే అవకాశముంది.

## ఆరోగ్యం

# చేపలతో పాటు కలిపి వీటిని ఎట్టి పరిస్థితుల్లో తినకండి.. యమ డేంజర్..

చేపలు ఆరోగ్యానికి మంచిది. వీటిలో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. అయితే, చేపలతో పాటు కొన్ని ఫుడ్స్ కలిపి తినకూడదు. తింటే.. కొందరికి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

చాలా మంది చేపల్ని ఇష్టంగా తింటారు. కొంతమందికి చేప లేనిదే ముద్దదిగదు. ఇక, ఆదివారం వచ్చిందంటే చాలు చాలా మంది చేపను ఓ పట్టు పడతారు. చేప పులుసు, చేప ఫ్రై, చేప బిర్యానీ ఇలా ఏ ఐటమ్ అయినా సరే తగ్గేదే లే అంటున్నారు. ఇక చేపలు తినడం వల్ల ఆరోగ్యానికి బోలెడు ప్రయోజనాలు ఉంటాయి. చేపల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ డి, విటమిన్ బి2, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, జింక్, అయోడిన్, ప్రోటీన్లు మెండుగా ఉంటాయి. అయితే, చేపలు తిన్న వెంటనే లేదా కొన్ని తినకూడని ఫుడ్స్ ఉన్నాయి. ఇవి తింటే ఆరోగ్యానికి ప్రమాదం. ఆ ఫుడ్స్ ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.

### పాలు, పాలు పదార్థాలు..

చికెన్, మటన్ లేదా చేపలు ఏదైనా నాన్ వెజ్ ఐటమ్ తిన్న తర్వాత పాలు తాగకూడదని నిపుణులు చెబుతున్నారు. పాలు జీర్ణమయ్యే ప్రక్రియ చేపలకు భిన్నంగా ఉంటుంది. పాలు, చేప కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో టాక్సిన్స్ ఏర్పడతాయి. చేప జీర్ణం కావడానికి సమయం పడుతుంది, ఇది జీర్ణ ప్రక్రియకు అడ్డుపడుతుంది. ఈ కాంబినేషన్ ఎక్కువకాలం తీసుకుంటే.. ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. పొత్తికడుపు నొప్పి, వికారం, అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం, అల్సర్లు, శరీరం చెడు వాసన, మలబద్ధకం, చర్మ సమస్యలు, కడుపు సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.





### పెరుగు..

పెరుగు కూడా చేపతో కలిపి తీసుకోకూడదు. చాలా మంది చేపతో భోజనం చేసిన తర్వాత.. పెరుగుతో తినకూడదు. ఇలా చేయడం వల్ల జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదముందని నిపుణులు చెబుతున్నారు. ఇక, బిర్యానీలో కూడా పెరుగు కలుపుకుని తింటాం. ఇది ఏ మాత్రం మంచిది కాదంటున్నారు నిపుణులు. అజీర్తి సమస్యలు ఉన్నవారు ఈ కాంబినేషన్కు దూరంగా ఉండాలి.



### వేయించిన ఆహారాలు..



వేయించిన ఆహారాలు, స్పైసీ ఫుడ్స్తో కలిపి చేపలు తినకూడదు. చేపల్ని తిన్నప్పుడు తేలికపాటి రుచి కొంత వరకు తగ్గుతుంది. చేపలతో పాటు వేయించిన ఆహారాలు, మసాలా ఫుడ్స్ తినడం వల్ల జీర్ణ సమస్యలు, కడుపు ఉబ్బరం, అసౌకర్యం, కడుపు నొప్పి వస్తాయి. అందుకే చేపతో పాటు ఈ ఫుడ్స్ తినకూడదని నిపుణులు చెబుతున్నారు.

### బంగాళదుంపలు..



చేపలు తిన్న వెంటనే బంగాళదుంప తినకూడదు. చేపల్లో ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. అయితే, బంగాళదుంపలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఈ రెండు కలిపి తింటే అజీర్తి సమస్యలు, వికారం, వాంతులు వచ్చే ప్రమాదముంది. అందుకే.. వీటిని కలిపి తీసుకోకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### సిట్రస్ ఫ్రూట్స్..

చేపలతో పాటు సిట్రస్ ఫ్రూట్స్, జ్యూసులు తీసుకోకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సిట్రస్ ఫ్రూట్స్లో సిట్రిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. చేపల్లో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. ఈ రెండూ కలిపి చర్య జరిపే అవకాశం ఉంది. దీంతో కడుపు సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదముందని నిపుణులు అంటున్నారు. అందుకే ఈ ఫుడ్ కాంబినేషన్కి దూరంగా ఉండాలి.

### చేపల వల్ల ఆరోగ్య ప్రయోజనాలు..



చికెన్, మటన్తో పోలిస్తే చేపలను తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. చేపల్లోని పోషకాలు మెదడు,నాడీ వ్యవస్థను, ఎముకలు, కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడుతాయి. చేపలు గుండె, కళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అందుకే.. వారానికి రెండు సార్లు మన డైట్లో ఏదో ఒక రూపంలో చేపలను చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సాల్మన్, ట్యూనా, ట్రౌట్, సార్డినెస్, మాకేరెల్ వంటి కొవ్వు చేపలు చేర్చుకుంటే ఇంకా మంచిది.

గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.

